




సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

సోమవారం 18-8-2025

సంపుటి: 21 సంచిక: 125

పేజీలు: 8 వెల: రూ.1




## నిఘా వైఫల్యం

# నకిలీ నోట్ల కలకలం

* ఎస్పీ కార్యాలయానికి కూతవేటు దూరంలోనే
* డీజీపీ కార్యాలయం అలెర్ట్ చేస్తే తప్ప సమాచారం లేని పోలీసులు
* డే అండ్ నైట్ జంక్షన్‌లోని లాడ్జీల్లో కొన్ని రోజులుగా దందా
* నగరానికి చెందిన ఓ పెద్దమనిషి కీలక పాత్రధారిగా అనుమానాలు

సత్యంన్యూస్, శ్రీకాకుళం

నేర నియంత్రణలో అతి కీలకమైనది.. నిఘా. అది కన్ను చేరేస్తే నేరాలకు అడ్డుండదు.. ఇక్కడా అక్కడా అన్న తేడా కూడా ఉండదు. శ్రీకాకుళంలో అచ్చం ఇదే జరిగింది. జిల్లా పోలీస్ కార్యాలయానికి కూతవేటు దూరంలోనే కొన్ని రోజులుగా దొంగనోట్ల చెలామణీ దందా జరిగిపోతున్నా పోలీసుల దృష్టికి రాలేదు. రాష్ట్ర పోలీస్ బాస్ (డీజీపీ) కార్యాలయం నుంచి సమాచారం అందితే తప్ప స్థానిక పోలీసులు అప్రమత్తం కాలేదంటే జిల్లాలో నిఘా ఎంత నీరసంగా ఉందో వేరే చెప్పనక్కర్లేదు. తమకు అందిన ఫిర్యాదును డీజీపీ కార్యాలయం జిల్లా పోలీసు కార్యాలయానికి పంపడంతో అలెర్టయిన పోలీసులు తనిఖీలు నిర్వహించి జిల్లా ఎస్పీ కార్యాలయ సమీపంలోనే ఉన్న ఒక లాడ్జీని కేంద్రంగా చేసుకుని గత ఇరవై రోజులుగా దొంగనోట్లు చెలామణీ చేస్తున్న ముఠా సభ్యులను పట్టుకున్నట్లు తెలిసింది. వాటాల విషయంలో ముఠా సభ్యుల మధ్య తేడాలు రావడం వల్లే ఈ సమాచారం బయటకొచ్చిందని పోలీసువర్గాలు పేర్కొన్నాయి.

### అనైతిక కార్యకలాపాలకు అడ్డాలు

రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడ ఏచిన్న ఘటన జరిగినా.. నగరంలోని లాడ్జీల్లో తనిఖీల పేరుతో పోలీసులు హడావుడి చేస్తుంటారు. అలాగే రిపబ్లిక్ డే, స్వాతంత్ర్య దినోత్సవం వంటి ముఖ్యమైన రోజుల్లో భద్రతా కారణాలతో లాడ్జీల్లో తనిఖీలు చేయడం సర్వ సాధారణం. మిగిలిన రోజుల్లో మాత్రం లాడ్జీలను పట్టించుకోరన్న విమర్శలు ఉన్నాయి. ఫలితంగా ఎస్పీ కార్యాలయానికి కూతవేటు దూరంలోనే ఉన్న లాడ్జీ కేంద్రంగా దొంగనోట్ల దందా యథేచ్ఛగా సాగి.. చివరికి డీజీపీ కార్యాలయ హెచ్చరికలతో గుట్టు రట్టయింది. జిల్లా కేంద్రంలోని దాదాపు అన్ని లాడ్జీల్లో పేకాట, మద్యపానం, ఇతర అసాంఘిక కార్యకలాపాలు నిత్యకృత్యమయ్యాయి. ఇటువంటి అసాంఘిక కార్యకలాపాలు ఎన్నోసార్లు వెలుగు చూసినా పోలీసులకు పట్టడం లేదన్న విమర్శలున్నాయి. కొద్దిరోజుల క్రితం డే ఆండ్ నైట్ జంక్షన్‌లోని ఒక లాడ్జీలో పేకాడుతూ కొందరు దొరికారు. టాస్క్‌ఫోర్సు ద్వారా జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో పేకాటను అదుపు చేయగలిగిన పోలీసు బాస్ లాడ్జీల్లో జరుగుతున్న జూదం, ఇతర అసాంఘిక కార్యకలాపాలను మాత్రం నియంత్రించలేకపోతున్నారని వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

### జిల్లా కేంద్రాన్ని గాలికొదిలేశారా?

పలాస, మెళియాపుట్టి, జి.సిగడాం కేంద్రంగా నకిలీ నోట్ల చెలామణీ చేస్తున్న ముఠాలు గతంలో చిక్కాయి. వీరికి వైజాగ్, రాజమండ్రి, తిరుపతికి చెందిన ముఠాలతో సంబంధాలు ఉన్నట్లు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ ముఠాలన్నీ పలాస కేంద్రంగా నకిలీ నోట్లు చెలామణీ చేస్తున్నట్లు ఆధారాలు లభించడంతో పోలీసులు పలాసపైనే దృష్టిపెట్టి జిల్లా కేంద్రాన్ని గాలికొదిలేశారు. ఇదే అదనుగా నకిలీ నోట్ల ముఠాలు జిల్లా కేంద్రాన్నే అడ్డాగా మార్చేసుకున్నాయి. ఇటీవల డే అండ్ నైట్ జంక్షన్‌లోని ఒక లాడ్జీలో ఇద్దరు వ్యక్తులను పోలీసులు పట్టుకోవడంతో వ్యవహారం వెలుగులోకి వచ్చింది. నకిలీ నోట్ల వ్యవహారంలో నగరానికి చెందిన ఒక ప్రముఖుడి పాత్ర ఉన్నట్లు గుర్తించారు. పోలీసుల దర్యాప్తులో మరికొన్ని అంశాలు కూడా వెలుగు చూసినట్టు తెలిసింది. గతంలో పట్టుబడిన నకిలీ నోట్ల ముఠాలపై దృష్టి సారించకపోవడంతో పోలీసుల వైఫల్యం వల్లే జిల్లా కేంద్రం నకిలీ నోట్లు చెలామణీకి తెర లేచిందన్న వాదనలు వినిపిస్తున్నాయి.



# హరీ! పదవిని పంచుకోవాలి మరి

- నగర అధ్యక్షుడు పోస్టుకు పంపకాల కిరికిరి
- మొదటి ఏడాది అధ్యక్షుడిగా కోరాడ
- రెండున్నరేళ్లకు సర్వేశ్వరరావు
- జిల్లా సంఘానికి కోరాడ సేవలు
- తెగ్గొట్టి నెగ్గించిన కళింగకోమటి నేతలు



వార్త చివరి పేజీలో




## సముద్రంలో మునిగిపోక ముందు

# ద్వారకానగరం ఎలా ఉండేది?

* గుజరాత్ తీరప్రాంతాన కొలువైన ద్వారక నగరం శ్రీకృష్ణుడి భక్తులను ఆకర్షిస్తూ ఉంటుంది. గుజరాత్‌లో ఈ నగరాన్ని దేవభూమిగా పిలుస్తుంటారు. హిందువుల విశ్వాసాలపై అధ్యయనం చేసే శాస్త్రవేత్తలను, పరిశోధకులను కూడా ఈ ప్రాంతం ఆకర్షిస్తుంటుంది. మహాభారత సమయంలో కృష్ణుడి ద్వారక ప్రాంతం ఎలా ఉండేది? ఇక్కడ ఎవరు నివసించేవారు? వారి జీవన విధానం ఎలా ఉండేది? వంటి విషయాలను సాక్ష్యాధారాలతో ధ్రువీకరించేందుకు పురావస్తు శాస్త్రవేత్తలు ఇక్కడ తవ్వకాలు జరుపుతున్నారు. సముద్రంలో మునిగిపోయిన ద్వారక నగరంలోకి డైవర్స్‌ను పంపుతూ మెరైన్ ఆర్కియాలజిస్టులు (సముద్ర పురావస్తు శాస్త్రవేత్తలు) పరిశోధనలు జరుపుతున్నారు.
* సముద్రగర్భంలోని ద్వారకలో తవ్వకాలు జరిపి, పరిశోధనలు చేసేందుకు ఈ ఏడాది ఫిబ్రవరిలో ఒక బృందం వెళ్లింది. మరోవైపు, ద్వారక నగరాన్ని బంగారంతో నిర్మించారని, ఆ తర్వాత ఆ నగరం సముద్రంలో మునిగిపోయిందని ఆధ్యాత్మిక సాహిత్యంలో కొన్ని ప్రస్తావనలున్నాయి. అయితే, అసలు ద్వారక నగరం ఎలా సముద్రంలో మునిగిపోయిందో తెలుసుకోవడం కోసం దశాబ్దాలుగా ఎన్నో ప్రయత్నాలు సాగుతున్నాయి. అంతేకాక, అసలైన ద్వారకా నగరం ఎలా ఉండేదో తెలుసుకునేందుకు కూడా ఎన్నో అధ్యయనాలు నిర్వహించారు.




బీబీసీ సౌజన్యంతో

### ద్వారకలో ఇళ్ల నిర్మాణం ఎలా ఉండేది?

'ధోలావీరా, సుర్కోటడాలలో కనుగొన్న నిర్మాణాల్లో, సహజ సిద్ధమైన రాళ్లు ఉండేవి. అయితే, ద్వారకలో మాత్రం రాపిడికి గురైనట్టున్న రాళ్ల గోడల అవశేషాలే ఉన్నాయి. వీటిల్లో చిన్న రాళ్ల నుంచి రెండు మీటర్ల వరకు పొడవైన రాళ్లు ఉన్నాయి' అని ఎస్.ఆర్.రావు తన పుస్తకంలో రాశారు. 'తవ్వకాల్లో గోడలతో ఉన్న పూర్తి ఇళ్లు చాలా తక్కువగా బయటపడ్డాయి. దీంతో ఆ సమయంలో ఇళ్లు ఎంత పెద్దవిగా ఉన్నాయో అంచనా వేయడం కష్టం. కానీ, మేం కనుగొన్న దాన్నుంచి, అక్కడ ఇళ్లు కనీసం 20 మీటర్ల పొడవు నుంచి 10 మీటర్ల వెడల్పులో ఉన్నట్లు అంచనావేయచ్చు' అని పుస్తకంలో చెప్పారు. వీటితో పాటు తవ్వకాల్లో మందంగా ఉన్న ఉన్న పిల్లర్లను కూడా గుర్తించారు. 'గోమతి నదిపై ఉన్న పురాతన ద్వారకా కేవలం సముద్రంలో గుర్తించిన అవశేషాలకే పరిమితం కాలేదు. ద్వారకాధీశ్ ఆలయం ప్రాంతంలో జరిపిన తవ్వకాల్లో కూడా ఎన్నో అవశేషాలు బయటపడ్డాయి. దీంతో, ద్వారక నగర భూగర్భ ప్రాంతం చాలా పెద్దదని తెలుస్తోంది. ఆధునిక ద్వారక నగరం కింద చాలా పెద్ద పురాతన ద్వారకా నగరం ఉండి ఉండవచ్చు' అని ప్రొఫెసర్ ఎస్.ఆర్.రావు తన పుస్తకంలో రాశారు.

### అసలైన ద్వారకను ఎలా నిర్ణయించారు?

అసలైన ద్వారక ఏదనే విషయమై నాలుగు పేర్లు వినిపిస్తుంటాయి. ఇందులో ప్రస్తుతం ఉన్న ద్వారక నగరంతో పాటు బెట్ ద్వారక, పోరుబందరు నుంచి 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న విశ్వవద, మదాపుర్ సమీపంలోని కోడినర్, గిర్నారే ఆ నాలుగు పేర్లు. అయితే పూర్వపు ఆనవాళ్లు ఏవీ లభించపోవడం, సమీపంలో సముద్రమే లేకపోవడం వల్ల గిర్నార్ దగ్గరలో ద్వారక ఉండే అవకాశమే లేదని ప్రముఖ పురావస్తు శాస్త్రవేత్త ప్రొఫెసర్ హస్ముఖ్ సాంఖ్య, ప్రముఖ మెరైన్ ఆర్కియాలజిస్ట్ డా. ఎస్.ఆర్.రావు అభిప్రాయడ్డారు. దీంతో గిర్నార్ ద్వారక అయ్యే అవకాశం లేదని తేల్చారు. అంతిమంగా పరిశోధన లన్నీ ప్రస్తుతం ఉన్న ద్వారకానగరం, బెట్ ద్వారకా చుట్టూనే సాగుతున్నాయి.

ద్వారకానగరం జమ్నానగర్ జిల్లాలో ఉంది. 8వ, 9వ శతాబ్దాల నుంచి దీన్ని కృష్ణుడు నివసించిన ద్వారకగా చెబుతున్నారు. ఇక్కడ జరిపిన పరిశోధనలు కూడా ద్వారకా నగరానికి చెందిన ఎన్నో ఆధారాలను సేకరించాయి. ద్వారక రహస్యాలను తెలుసుకోవడానికి 1963లో పుణేలోని డెక్కన్ కాలేజీ తవ్వకాలు జరిపింది. అయితే అంతకుమందు ప్రాథమికంగా కూడా కొన్ని తవ్వకాలు జరిగాయి. ప్రొఫెసర్ ఎస్.ఆర్.రావు ద్వారకలో అనేక పరిశోధనలు చేశారు. ద్వారకా నగరంపై పుస్తకాన్ని కూడా రాశారు. ఆయన రాసిన 'మెరైన్ ఆర్కియాలజీ ఆఫ్ ఇండియా'లో.. '1963లో ద్వారకాధీశ్ టెంపుల్ కాంప్లెక్స్‌కు బయట డెక్కన్ కాలేజీ జరిపిన తవ్వకాలు మహాభారత కాలంలో పేర్కొన్న ద్వారకా ఇదేనని నిర్ధారించాయి' అని పేర్కొన్నారు. మహాభారత కాలం నాటి ద్వారక నిర్ధారణ అయిన తర్వాత కూడా 1981లో మెరైన్ ఆర్కియాలజీ కేంద్రం బెట్‌ద్వారకలో తవ్వకాలు జరిపింది. 1983లో బెట్ ద్వారకలో తొలిసారి సముద్ర గర్భంలో తవ్వకాలు జరిపారు. 1990 వరకు ఇలా తొమ్మిదిసార్లు తవ్వకాలు చేపట్టారు. ద్వారకలో, బెట్ ద్వారకలో, సోమనాథ్‌లో 1991-92లో పెద్ద ఎత్తున తవ్వకాలు జరపగా.. 1995 వరకు ప్రధానంగా 18 సార్లు తవ్వకాలు చేపట్టారు. 2001లో 'అండర్‌వాటర్ ఆర్కియాలజీ వింగ్'ను ఏర్పాటుచేసిన తర్వాత, ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా (ఏఎస్ఐ) సముద్ర గర్భంలో మరిన్ని తవ్వకాలు జరిపింది. 2007 నాటి తవ్వకాలను మరింత ముఖ్యమైనవిగా చెబుతుంటారు. ద్వారకా నగరం గురించి బీబీసీ ప్రచురించిన డాక్యుమెంటరీ లో.. 2007లో సముద్ర గర్భంలో విస్తృతంగా జరిపిన తవ్వకాల గురించి ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియాకు చెందిన ఆర్కియాలజిస్ట్ ప్రొఫెసర్ అలోక్ త్రిపాఠి మరింత వివరించారు. 2007నాటి తవ్వకాలకు డాక్టర్ అలోక్ త్రిపాఠి డైరెక్టర్‌గా వ్యవహరించారు. 'మహాభారతంలోని వర్ణనలకు సమకాలీనంగా ఉన్న ఏకైక ప్రాంతం ద్వారకానే. 1963లో డెక్కన్ కాలేజీ తవ్వకాలు జరిపిన తర్వాత, ఏఎస్ఐతో భాగస్వామ్యమైన పురావస్తు శాస్త్రవేత్తలు దీనికి సంబంధించిన ఆధారాలను సేకరించేందుకు ఎన్నో ప్రయత్నాలు చేశారు. దీనిలో 500కి పైగా వస్తువులను సేకరించారు. అవి కనీసం 2వేల ఏళ్ల నాటివి. సముద్ర గర్భంలో జరిపిన తవ్వకాల్లో పలు నిర్మాణాలు ఉన్నట్లు ఆధారాలు సేకరించారు. వాటి నిర్మాణాల్లో, అక్కడ నౌకాశ్రయం ఉందని స్పష్టంగా తెలిసింది' అని ఆయన తెలిపారు. 'వివిధ సాహిత్యాల ద్వారా అసలైన ద్వారక ఏదనేది మాకు తెలిసింది. మహాభారతం, పురాణాలు కూడా ఈ నగరాన్ని సముద్రం మింగేసిందని పేర్కొన్నాయి. తర్వాత వివిధ మార్గాలు, పరిశోధనల తర్వాత, ప్రస్తుత ద్వారక ప్రాంతాన్ని గుర్తించాం. అక్కడ తవ్వకాలు జరిపాం' అని డాక్టర్ అలోక్ త్రిపాఠి ఒక ఇంటర్వ్యూలో చెప్పారు.

### ద్వారకా నగర శైలి ఎలా ఉండేది?

ద్వారకా నగరంలో జరిపిన తవ్వకాల్లో బయటపడిన శిథిలాల్లో పట్టణ ప్రణాళిక (అర్బన్ ప్లానింగ్) గురించి కూడా వెల్లడైంది. 'బాల్‌భవన్ నుంచి గోమతి వరకున్న బెల్ట్‌లో ఒక పొడవైన గుంత కనిపించింది. ఈరకమైన గుంతలు కోటల చుట్టూ చూడొచ్చు. వీటిల్లో నీటిని నిల్వ ఉంచుతారు' అని ప్రొఫెసర్ ఎస్.ఆర్.రావు తన పుస్తకంలో పేర్కొన్నారు. సముద్ర గర్భంలో జరిపిన తవ్వకాల్లో కోటలకు చెందిన కొన్ని శిథిలాలను, అవశేషాలను కూడా గుర్తించారు. 'పెద్ద సంఖ్యలో బురుజులను గుర్తించాం. ఈ తరహా నిర్మాణం కోటల బయటి గోడపై ఉంటుంది. కోట చుట్టూ ఉన్న మూలల్లో ఇవి ఉంటాయి. 30 నుంచి 40 బురుజులను గుర్తించాం' అని రాశారు. ఈ పరిశోధనలో 500కు పైగా వస్తువులను కనుగొన్నారు. ఇవి కనీసం 2000 సంవత్సరాల పురాతనమైనవని భావిస్తున్నారు. ద్వారక నౌకాశ్రయ శిథిలాల నుంచి ఏం తెలిసింది? ప్రొఫెసర్ ఎస్.ఆర్.రావు తన పుస్తకంలో ద్వారకా నౌకాశ్రయం గురించి సవివరంగా రాశారు. 'క్రీస్తు పూర్వం 2300 ప్రారంభంలో, ద్వారకా పోర్టు డాక్ పశ్చిమ గోడను ఆనుకుని 240 మీటర్ల పొడవు, 13 మీటర్ల వెడల్పుతో ఒక బ్రిక్ ప్లాట్‌ఫామ్‌ను (రాతి ప్లాట్‌ఫామ్‌ను) లోథల్ ఇంజనీర్లు నిర్మించారు. ఈ పెద్ద ప్లాట్‌ఫామ్‌ను ఆనుకుని - మిగతా చివరి పేజీలో

• ఎడిటోరియల్

# మార్వాడీ గోబ్యాక్.. కొత్త తెలం'గానం'!

సాటి తెలుగువారినే 'ఆంధ్రోళ్లు' అని చిన్నచూపు చూడటం.. మా నిధులు, వనరులు దోచుకుంటూ మాపై పెత్తనం చెలాయిస్తున్న ఆంధ్రోళ్లు వెనక్కి వెళ్లిపోవాలని తెలంగాణవాసులు హటం చేయడం కొత్త కాదు. అదే చివరికి తెలుగువారి ఉమ్మడి రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ రెండుముక్కలవ్వడానికి కారణమైంది. అయినా ఇప్పటికీ తెలంగాణలో సెటిలైన ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారిని అక్కడి ప్రజలతోపాటు రాజకీయ నాయకులు వేరుగా చూస్తుంటారు.. పరుష వ్యాఖ్యలు చేస్తుంటారు. ఇప్పుడు వారు మరో నినాదం అందుకున్నారు. అదే 'మార్వాడీ గో బ్యాక్'. ప్రస్తుతం ఆ రాష్ట్రమంతటా ఇదే ట్రెండింగులో ఉంది. వ్యాపారాల పేరుతో ఇక్కడికి వచ్చి తమ జీవనోపాధి, వ్యాపారావకాశాలను తన్నుకుపోతున్నారని.. అందుకే మార్వాడీలు తెలంగాణ నుంచి వెళ్లిపోవాలని నినదిస్తుండటంతో అదో ఉద్యమంగా మారుతోంది. తాజాగా అది రాజకీయ రంగు కూడా పులుముకుంటోంది. పార్కింగ్ విషయంలో వివాదం నేపథ్యంలో ఓ యువకుడిపై మార్వాడీలు దాడి చేయటం.. గోరేటి రమేష్ అనే వ్యక్తి మార్వాడీల వ్యాపార ఆధిపత్యాన్ని, దోపిడీని విమర్శిస్తూ రూపొందించి, పాడిన పాట సోషల్ మీడియాలో వైరల్‌గా మారి మార్వాడీలకు వ్యతిరేకంగా పనిచేస్తోంది. అయితే మార్వాడీ గో బ్యాక్ అని హెచ్చరించడం తప్పుడు చర్య అని చెప్పాలి. పరిపాలన, భాషాపరంగా రాష్ట్రాలు ఏర్పడిన.. ప్రజాస్వామ్య దేశంలో ప్రజలు తమకు నచ్చిన, అనుకూలంగా ఉన్న పట్టణాలు, ప్రాంతాల్లో నివసించే హక్కు కలిగి ఉన్నారు. దానికి విరుద్ధంగా రాజస్తాన్ నుంచి దశాబ్దాల క్రితమే తరలివచ్చి వ్యాపారాలు చేసుకుంటూ నివసిస్తున్న వారిని పరాయి ప్రజలుగా పరిగణించడం, వెళ్లిపొమ్మని చెప్పడం ఏమాత్రం సమంజసం కాదు. తెలంగాణలో మార్వాడీల ఉనికి ఇప్పటిది కాదు. నిజాం కాలం నుంచే వారు తెలంగాణలో స్థిరపడి వ్యాపార రంగంలో రాణించడం మొదలుపెట్టారు. రాజస్థాన్‌లోని మార్వార్ ప్రాంతం.. అంటే జోధ్‌పూర్, బికనీర్, జైసల్మేర్, బార్మర్ వంటి ఎడారి చుట్టుపక్కల ప్రాంతాల్లో వీరు నివసిస్తుంటారు. మారు (థార్ ఎడారి ప్రాంతం), వాడి (నివాసం).. రెండు పదాల కలయికతో మార్వాడీ అనే పదం వచ్చింది. వీరు నివసించే ప్రాంతమంతా ఎడారి భూములే కావడంతో వ్యవసాయం ఉండదు. దాంతో వారంతా ప్రధానంగా వ్యాపారంపై దృష్టి పెట్టారు. 16వ శతాబ్దంలో మొఘల్ పాలన కాలంలో రాజస్తాన్, గుజరాత్ నుంచి దేశవ్యాప్తంగా వలసలు వెళ్లి వ్యాపారాలను విస్తరించారు. బ్రిటీష్ హయాంలో వారికే ఆర్థిక సేవలు అందించటంతో పాటు దూర ప్రాంతాలకు డబ్బు బదిలీ చేసే వ్యవస్థను అభివృద్ధి చేశారు. ఇదే ఆధునిక బ్యాంకింగ్ వ్యవస్థకు బాటలు వేసింది. ఇక తెలంగాణ విషయానికొస్తే.. నిజాం కాలంలోనే హైదరాబాద్ ప్రముఖ వాణిజ్య కేంద్రంగా మారడంతో మార్వాడీలు ఇక్కడికి వలస రావడం ప్రారంభించారు. బంగారం, వస్త్రాలు, కిరాణా, ఆయిల్ మిల్లు వంటి రంగాల్లో వ్యాపారాలు చేపట్టి ఆధిపత్యం సాధించారు. ఈ క్రమంలోనే హైదరాబాద్‌లోని బేగం బజార్, సుల్తాన్‌బజార్, కిషన్‌బాగ్.. ఆ చుట్టుపక్కల ప్రాంతాలను తమ వ్యాపార కేంద్రాలుగా మార్చుకున్నారు. 1948లో హైదరాబాద్ సంస్థానం స్వతంత్ర భారతదేశంలో విలీనమైన తర్వాత మార్వాడీలు తమ వ్యాపార సామ్రాజ్యాన్ని మరింత విస్తరించారు. వరంగల్, కరీంనగర్, నిజామాబాద్ వంటి నగరాల్లో కూడా పాగా వేసి స్వీట్ షాపులు, పానీపూరీ స్టాల్స్, బంగారం దుకాణాలు, రియల్ ఎస్టేట్ వంటి వ్యాపారాలను స్థాపించారు. ఈ నేపథ్యంలో తెలంగాణలో మార్వాడీల వ్యాపార ఆధిపత్యం వివాదాస్పదంగా మారింది. రాష్ట్రవ్యాప్తంగా వ్యాపారాల్లో ఎక్కువగా మార్వాడీలే ఉంటున్నారని, స్థానికులకు అవకాశం లేకుండా చేస్తున్నారని తెలంగాణవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మార్వాడీ వ్యాపారులు తక్కువ ధరలకు అమ్మకాలు చేస్తుండటం వల్ల స్థానిక స్థానిక వ్యాపారులకు గిరాకీ తగ్గుతోందని ఆరోపిస్తున్నారు. వాచ్‌మెన్ దగ్గర నుంచి సర్వెంట్ల వరకు అన్ని ఉద్యోగాలను రాజస్తాన్ నుంచే తమ బంధువులను, తెలిసినవారిని రప్పించి నియమిస్తున్నారన్న మరో ఆరోపణ ఉంది. దీనివల్ల స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించడంలేదని అంటున్నారు. ఇలాగే కొనసాగితే తమ మనుగడ కష్టమని ఆందోళన నుంచి మార్వాడీ గోబ్యాక్ అన్న నినాదం పుట్టుకొచ్చింది. మార్వాడీలను లక్ష్యంగా చేసుకోవడం రాజ్యాంగ హక్కును హరించడమేనని బీజేపీ, కాంగ్రెస్ నేతలు అంటున్నారు. బీఆర్ఎస్ మాత్రం దీనిపై ఇప్పటివరకు స్పందించలేదు. మార్వాడీ వ్యతిరేక ఉద్యమం గతంలో చెన్నైలోనూ మొదలైనా కొద్ది కాలానికే సద్దుమణిగింది. మరీ తెలంగాణలో ఏమవుతుందో?

# అత్యుత్తమ ప్రమాణాలతో శ్రీధర్ హాస్పిటల్

- శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్
- మెట్రో సిటీలను తలదన్నేలా వైద్యసేవలు అందిస్తాం
- ప్రముఖ గైనికాలజిస్ట్ డాక్టర్ దానేటి శ్రీధర్
- డాక్టర్ శ్రీధర్ హాస్పిటల్ ప్రారంభోత్సవం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



ఉత్తరాంధ్ర ప్రాంతానికే తలమానికంగా నిలిచేలా అత్యుత్తమ వైద్య ప్రమాణాలతో డాక్టర్ దానేటి శ్రీధర్ ఆసుపత్రిని ప్రారంభించారని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని సింహద్వారం సమీపంలో డాక్టర్ శ్రీధర్ హాస్పిటల్‌ను ఆయన ఆదివారం ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ ఆసుపత్రి జిల్లాకే తలమానికంగా నిలవనుందని ఆకాంక్షించారు. డాక్టర్ దానేటి శ్రీధర్ మాట్లాడుతూ సొంతంగా ఆసుపత్రిని నెలకొల్పడం తన చిన్ననాటి కల అని, అతి తక్కువ ఫీజులతో ఐవీఎఫ్ వైద్యం ద్వారా ఎంతో తల్లులకు మాతృత్వపు మధురిమలు అందించానని చెప్పారు. యూరప్ దేశాల్లో ఉండే ఇంటర్నేషనల్ ప్రమాణాలతో కూడిన మెడికవర్ గ్రూప్ సంస్థలను జిల్లాలో నెలకొల్పేందుకు తాను ఎంతోగానో శ్రమపడి విజయం సాధించానన్నారు. ఇక్కిగై పేరుతో ఇప్పుడు తాను నూతనంగా ప్రారంభించిన ఆసుపత్రిలో అతితక్కువ ఖర్చుతో మెరుగైన వైద్యసేవలు అందజేస్తానని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి, ఎమ్మెల్యేలు నడికుదిటి ఈశ్వరరావు, బగ్గు రమణమూర్తి, మెడికవర్ ఆసుపత్రి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ హరికృష్ణ, అరకు మాజీ ఎంపీ జి.మాధవి, మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, మెండ దాసునాయుడు, కిల్లి రామ్మోహనరావు, వైద్యులు లక్ష్మీ నారాయణ, సాగరిక, అమ్మన్నాయుడు, విద్యాసాగర్, బగ్గు శ్రీనివాసరావు, గొండు గంగాధర్, సుడా చైర్మన్ కొరికాన రవికుమార్, డాక్టర్స్ ప్లాజా ఎండి జెవిస్ రాజు, న్యూ శ్రీకాకుళం బ్లడ్‌బ్యాంక్ అధినేత మణికంఠ, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు పిసిని చంద్రమోహన్, పైడి వేణుగోపాలరావు, వీరమహిళ బి.మోహనలక్ష్మీ, మామిడి విష్ణు, గురుప్రసాద్, కొండా ఉదయ్, విశ్వక్‌షేన్, గేదెల చైతన్య, దాసరి రాజు, వైద్యులు, ప్రముఖులు, డాక్టర్ దానేటి కుటుంబ సభ్యులు, మెడికవర్ సిబ్బంది పాల్గొన్నారు.

## నిరుపేద కుటుంబానికి ఆర్థిక సాయం



(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)

ఫరీదుపేట గ్రామానికి చెందిన పుల్లేటికుర్తి మోహనరావు గత కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతూ నాలుగు రోజుల క్రితం మరణించారు. నిరుపేద కుటుంబం కావడంతో శ్రీపైడివారి కుటుంబం ట్రస్టు, బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు కలిసి రూ.42,516 మోహనరావు భార్య మణికి సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా వారికి మోహనరావు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు పైడి చిన్న అప్పలనాయుడు, పైడి రాజశేఖర్, పైడి మనోజ్‌కుమార్, పైడి నర్సునాయుడు పాల్గొన్నారు.

# ఎరువుల దోపిడీని అరికట్టండి

సత్యంన్యూస్, టెక్కలి

ఎరువుల దోపిడీ అరికట్టాలని, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సొంత నియోజకవర్గంలో రైతులకు కావలసినంత ఎరువులు అందించలేని పరిస్థితిలో ఉందని టెక్కలి వైకాపా నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ అన్నారు. నియోజకవర్గం పరిధిలో దళారులు చేస్తున్న ఎరువులు దోపిడీని అరికట్టాలంటూ నినాదాలు చేశారు. టెక్కలి అంబేద్కర్ కూడా నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు వైకాపా శ్రేణులు, రైతులు సోమవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీవోకు రైతుల పడుతున్న ఇబ్బందులపై వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా తిలక్ మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి అందించవలసిన ఎరువులు దళారీలమయం చేసేస్తున్నారని ఆరోపించారు. తక్షణమే పలాస శివారు ప్రాంతాలకు సాగునీరు అందించాలని, ప్రభుత్వం ఎరువులు రైతులకు రైతుభరోసా కేంద్రాల ద్వారా ఎరువులు అందించాలని, పంటల బీమా ప్రభుత్వమే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నందిగాం ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి, టెక్కలి సంతబొమ్మాళి వైకాపా జిల్లా అధ్యక్షులు కిల్లి అజయ్, బుద్ధమోహన్ రెడ్డి, సత్తార్ సత్యం, యాదవ సంఘం నాయకులు గురునాథ యాదవ్, కూరాకుల సుబ్బారావు, గేదెల చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.








ఒకప్పుడు రాజభోగాలు అనుభవించింది.. ఇప్పుడు తిండికి గతిలేక భిక్షాటన చేస్తోంది.. ఈ హీరోయిన్ పరిస్థితి మహా దారుణం. సినిమా, టెలివిజన్ ఇండస్ట్రీలో ఒకసారి గుర్తింపు వచ్చిందంటే.. ఇక వారి కెరీర్‌కు లోటు ఉండదు. ఈ పాపులారిటీతోనే కెరీర్‌లో సెకండ్ ఇన్నింగ్స్ స్టార్ట్ చేసిన హీరో, హీరోయిన్లు ఎంతోమంది ఉంటారు. సినిమా, టెలివిజన్ ఇండస్ట్రీలో ఒకసారి గుర్తింపు వచ్చిందంటే.. ఇక వారి కెరీర్‌కు లోటు ఉండదు. ఈ పాపులారిటీతోనే కెరీర్‌లో సెకండ్ ఇన్నింగ్స్ స్టార్ట్ చేసిన హీరో, హీరోయిన్లు ఎంతోమంది ఉంటారు. ఇలా 30, 40 ఏళ్లకు పైగా ఇండస్ట్రీలో కొనసాగినవారున్నారు.

ఓ నటి సైతం భారతీయ టెలివిజన్ ఇండస్ట్రీలో ఏకంగా 30 ఏళ్లకు పైగా నటించింది. టీవీ సీరియల్స్‌లో యూనిక్ రోల్స్‌తో పాపులర్ అయింది. అయితే కెరీర్ పీక్స్‌లో ఉండగా ఆమె తీసుకున్న నిర్ణయం, తన జీవితాన్నే మార్చేసింది. ఒకప్పుడు లగ్జరీ లైఫ్ గడిపిన ఆ నటి.. ఇప్పుడు రోజు గడవటానికి భిక్షాటన చేస్తోంది. ఆమె ఎవరో కాదు.. నుపూర్ అలంకార్.

# ఈ హీరోయిన్ పరిస్థితి మహా దారుణం!

ఇండియన్ టెలివిజన్ ఇండస్ట్రీని దాదాపు 3 దశాబ్దాల పాటు ఏలిన నటి.. నుపూర్ అలంకార్. 1972, నవంబర్ 25న జైపూర్‌లో జన్మించింది. శక్తిమాన్, దియా ఔర్ బాతి హమ్, ఘర్‌కి లక్ష్మీ బేటియాన్ వంటి పాపులర్ సీరియల్స్ సహా 157కి పైగా టెలివిజన్ షోలు చేసింది. అయితే, కెరీర్ పీక్స్‌లో ఉండగా కొంతమంది మాత్రమే సాహసం చేసే నిర్ణయాన్ని తీసుకుని అందరినీ షాక్‌కి గురిచేసింది. 2022 ఫిబ్రవరిలో ఆమె ఈ ప్రాపంచిక జీవితానికి గుడ్‌బై చెప్పి సన్యాసం స్వీకరించింది. ఇక, తన జీవితాన్ని ఆధ్యాత్మిక విషయాలకు అంకితం చేసుకోవాలని డిసైడ్ అయ్యింది.



ఆధ్యాత్మిక జీవితానికి అంకితం కావాలని నుపూర్ అనుకోవడం, అప్పటికప్పుడు తీసుకున్న నిర్ణయం కాదు. ఎప్పటి నుంచో ఈ మార్గాన్ని పాటించాలని ఆమె భావించింది. గురువు శంభు శరణ్ ఝా గైడెన్స్‌లో నుపూర్ ఆధ్యాత్మికతలో మునిగిపోయింది. యమునా, గంగా వంటి పవిత్ర నదులను సందర్శించింది. హిమాలయాల్లో ట్రావెల్ చేసింది. ఏకాంత ఆశ్రమాలు, పురాతన గుహల్లో నివసించింది. ఇలా, భౌతికంగానే కాక.. దైవంతో ఐక్యతను కోరుతూ ఇన్నర్ ట్రాన్స్‌ఫర్మేషన్‌గా ఈ జర్నీ మారింది. నుపూర్ తన కో-యాక్టర్ అలంకార్ శ్రీవాస్తవను 2002 లో వివాహం చేసుకుంది. మొదట్లో వీరి బంధం బాగానే కొనసాగినా.. తర్వాత వారి మధ్య దూరం పెరిగింది. నుపూర్ క్రమంగా ఆధ్యాత్మికత వైపు అట్రాక్ట్ అయింది. దీంతో వీరిద్దరూ రెండున్నర ఏళ్ల పాటు విడివిడిగానే జీవించారు. 2022లో నుపూర్ సంసార జీవితాన్ని వదిలిపెట్టి సన్యాసం స్వీకరించింది. అయితే, సన్యాసిగా మారాలనే తన నిర్ణయం ఆధ్యాత్మిక పిలుపని, పూర్తి స్వతంత్రంగా, విచక్షణతో తీసుకున్నదని ఆమె ప్రకటించింది. వ్యక్తిగత, వైవాహిక జీవిత సమస్యలు దీనికి కారణం కావని క్లారిటీ ఇచ్చింది. అయితే, వీరికి పిల్లలు లేరు. నుపూర్ అలంకార్.. సన్యాసి అయ్యాక తన ఆస్తులను పూర్తిగా వదిలేసుకుంది. ఆమె కాషాయ వస్త్రాలు ధరించి, కనీస అవసరాలతో జీవించే ఆధ్యాత్మిక జీవన శైలిని పాటిస్తోంది. డబ్బులు సంపాదించే ఏ పనిని కూడా చేయబోనని డిసైడ్ అయ్యింది. సంప్రదాయ సన్యాసుల మాదిరే ఆమె కూడా భిక్షాటనతో పొట్ట నింపుకుంటోంది. విరాళాలు, ఇతరుల దయపై ఆధారపడి జీవిస్తోంది. తన జీవితాన్ని స్పిరిచువల్ గ్రోత్, మెడిటేషన్, ప్రజల సేవకు అంకితం చేసినట్లు వెల్లడించింది.

గత ఏడాది రాసింది.. ఈ ఏడాది ఇంకా రాయలేదు. షోలే సినిమా ఎన్నిసార్లు చూసానంటే, ఆ సినిమా ఆపరేటర్ కూడా అన్నిసార్లు చూసి వుండడు. నా పాలిట అదో డ్రగ్. ఇప్పటికీ నిద్ర రాకపోతే చూస్తూ నిద్రపోతాను. ఏముంది దాంట్లో. జస్ట్ క్రైం థ్రిల్లర్. బందిపోట్లు మీద వచ్చిన ఎన్నో సినిమాలకి కాపీ. సెవెన్ సమురాయ్, ఫైవ్ మాన్ ఆర్మీ, మేరాగావ్ మేరా దేశ్, ఖోటే సిక్కే ఇవన్నీ కలిపితే షోలే కదా. నిజమే. జస్ట్ కాపీ అయితే షోలే ఎపుడో గాలికి పోయేది. ఆ సినిమాలో అంతు చిక్కని ఫిలసాఫికల్ జర్నీ వుంది. సలీం -జావేద్ రచనలోని గొప్పతనం అది. అంత గొప్పగా మళ్లీ వాళ్లు కూడా రాయలేకపోయారు. పల్ప్ రాసి విడిపోయారు.

# అదో పెద్ద బాలశిక్ష

**కథలు రాసుకోవడంలో పల్టీలు కొట్టే అనేక మంది డైరెక్టర్లకి, రచయితలకి షోలే ఒక పెద్ద బాలశిక్ష.**

1. రైలుతో ప్రారంభమైన సినిమా రైలుతోనే ముగుస్తుంది. జీవితం ఒక ప్రయాణం.

2. ప్రాణస్నేహితుడితో ఆనందంగా రైలు దిగిన ధర్మేంద్ర చివరికి స్నేహితుడు లేకుండా, కొత్త స్నేహితురాలితో తిరిగి వెళ్తాడు. ప్రయాణంలో మనతో ఉన్నవాళ్లు దిగిపోతారు. కొత్తవాళ్లు కలుస్తారు. మనం కూడా దిగిపోతాం. రైల్లోవుంటే దిగే స్టేషన్ తెలుసు. జీవితంలో స్టేషన్ ఎక్కడుందో తెలియదు.

3. ప్రపంచంలో అత్యంత భారం ఏమంటే కొడుకు శవపేటికని భుజాల మీద తండ్రి మోయడం. ఈ డైలాగ్ రాయాలంటే చాలా తెలియాలి. ఈ సీన్‌లో ఎకె.హంగల్ సాబ్ ఎక్స్‌ప్రెషన్ గొప్పది. లోపల ఏదో పిండేస్తుంది. చిన్నప్పుడు అర్థం కాలేదు. పెద్దయ్యాక కొంతమంది తండ్రులు బిడ్డల్ని పోగొట్టుకుంటూ వుంటే ఈ డైలాగ్ గుర్తొచ్చేది. భుజాల మీద మోసిన పిల్లల్ని, భుజాల మీద మోసే కష్టం ఎవరికీ రాకూడదు.

4. జీవితం అంతా బాగుంది, బాగుంటుందని అనుకుంటున్నప్పుడు దెబ్బ కొడుతుంది. పెళ్లి చేసుకుని, కాసింత పొలం కొనుక్కుని బతుకుదామనుకున్న అమితాబ్ అర్ధాంతరంగా చనిపోతాడు.

5. ఎందుకీ పనికిరానివాళ్లు కూడా కొన్నిసార్లు పనికొస్తారు. చెల్లని నాణెం రెండు వైపులా చెల్లదని జైలర్ అంటే (ఫస్ట్ సీన్) నాణేనికి, మనిషికి తేడా వుంటుందని సమాధానం. డబ్బు కోసం పని చేసే కిరాయి రౌడీల్లా హీరోలు కనిపించినా, వాళ్లలోపల మనిషి లక్షణాలు ఎక్కువగా వుంటాయి.

షోలేని అనుకరిస్తూ ఎన్ని సినిమాలు వచ్చినా తుస్సుమనడానికి కారణం ఈ తేడాని, క్యారెక్టర్‌ని రైటింగ్‌లో పట్టుకోలేకపోవడం. రైటింగ్‌లో లేనిది టేకింగ్‌లో రాదు. చెప్పుకుంటూపోతే చాలా ఉన్నాయి. కోతల రాయుల్ని చూస్తే అస్రాని, జగ్‌దీప్ గుర్తుకొస్తారు. పని రాకపోయినా పై హోదాల్లో ఎక్కువగా వుంటారు వీళ్లు.

నవ్వించి, నవ్వించి కాల్చే అంజాద్‌ఖాన్‌కి లేటెస్ట్ వెర్షన్ నేటి రాజకీయ నాయకులు. కాకపోతే వీళ్లు చంపరు. కొండచిలువలా కొంచెం కొంచెం మింగుతారు. దాని పొట్టలో జీర్ణం అవుతున్నప్పుడు కూడా మనం బతికేవుంటాం. అదో విషాదం. సంతోషంగా వుండే జయ, గంభీర దుక్క నదిలా మారిపోతుంది. అమితాబ్ మౌత్ ఆర్గాన్ వినిపిస్తుండగా దీపాల ముందు జయ. ఈ సీన్ ఎన్ని వందల సార్లు చూసినా.. అదో మార్మిక లోకం.

హేమ గౌరవం కాపాడ్డానికి గుర్రం తీసే పరుగు, బర్మన్ వినిపించే తబలా శబ్దం ఇంకా వెంటాడుతూనే వున్నాయి. చివరగా నా అభిమాన డ్యాన్సర్ హెలెన్ మెహబూబా పాట. భారతదేశాన్ని ఒక ఊపు ఊపిన పాట. 85 ఏళ్లలో కూడా హెలెన్ కళ్లలోని కళ, నవ్వుకి మించిన జీవన సారం వుంటుందా? ఆమె డ్యాన్స్‌ని మాత్రమే ప్రేమించింది. పద్మశ్రీతో సహా అన్నీ అవే వచ్చాయి.

షోలే వచ్చి 50 ఏళ్లైంది. తొలి ప్రేక్షకులతో సహా అందరూ పెద్దాళ్లు అయిపోయారు. చాలామంది పోయారు. సినిమా మాత్రం ఇంకా యవ్వనంగానే వుంది.

జి.ఆర్.మహర్షి





# సినిమాను మించిన ప్రేమకథ..

**విజయం మత్తునిస్తుంది. ఆ మత్తు నియంత్రణ కోల్పోతే జరిగే పరిణామాలు కనీసం ఊహించలేం. అలాంటి మత్తుతో తన భర్తకే చాలా కాలంపాటు దూరంగా గడపాల్సి వచ్చింది ఓ ప్రముఖ గాయకురాలు.**

అల్కాయాజ్ఞిక్.. బాలీవుడ్ సింగర్‌గా ఈమెది సుమారు నాలుగు దశాబ్దాల ప్రయాణం. 20వేలకు పైగా వివిధ భాషల్లో పాటలు పాడింది. ముఖ్యంగా 90ల్లో కుమార్ సాను, ఉదిత్ నారాయణ్‌తో కలిసి ఈమె పాడిన పాటలతో పాటు.. ఆమె ప్రత్యేకంగా జావేద్ అక్తర్ వంటివాళ్లు రూపొందించిన కొన్ని ప్రైవేట్ ఆల్బమ్స్‌లో గజల్స్ తోనూ ఆకట్టుకున్నారు. నాలుగు దశాబ్దాల కాలంలో ఎందరో హీరోయిన్ల పాటలకు ప్రధాన గొంతుక ఈ అల్కాయాజ్ఞిక్. అంతమంది మనసు చూరగొని సినీసంగీత ప్రయాణంలో అద్భుతమైన విజయాలు సాధించిన అల్కా వ్యక్తిగత జీవితంలో మాత్రం నాటకీయ మలుపులు కనిపిస్తాయి.

అల్కాయాజ్ఞిక్ భర్త నీరజ్ కపూర్. తనకు వచ్చిన విజయాలతో చాలా కుటుంబాల్లో లాగే అల్కాయాజ్ఞిక్ కుటుంబంలోనూ గొడవలు ప్రారంభమయ్యాయి. భార్యా, భర్తలిద్దరూ దూరం దూరంగానే గడిపినా వారి బంధం మాత్రం బీటలువారకపోవడమే ఈ అల్కాయాజ్ఞిక్ ప్రేమకథ ప్రత్యేకత.

### అసలు అల్కాయాజ్ఞిక్, నీరజ్ ఎలా కలిశారు..?

1989లో వ్యాపారవేత్త అయిన నీరజ్ కపూర్‌తో అల్కాయాజ్ఞిక్ పెళ్లి జరిగింది. రెండు కుటుంబాల మధ్య సంబంధాలు ఉండటంతో వారిరువురి పెళ్లికి ప్రేమ కూడా తోడై ఇద్దరినీ ముడివేసింది. నీరజ్‌ది మేఘాలయా. రాజధాని షిల్లాంగ్‌లో నీరజ్‌కు ఇల్లుంది. నీరజ్ వాళ్ల అత్త అల్కాయాజ్ఞిక్ తల్లికి క్లాస్‌మేట్. అల్కా తనను మౌసీ అని పిలుస్తుండేది. నీరజ్ ఆ మౌసీ మేనల్లుడు. అలా మౌసీ ఇంట్లోనే నీరజ్, అల్కా ఇద్దరూ మొదట కలుసుకున్నారు. ఆ తర్వాత వారి పరిచయం కాస్తా ప్రేమగా మారింది. ఈ విషయాలను ఓసారి అల్కాయాజ్ఞిక్ దూరదర్శన్ ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చారు.

నీరజ్‌తో ప్రేమలో ఉన్నప్పుడే అల్కాయాజ్ఞిక్ కెరీర్‌లో కూడా నిలదొక్కుకుంటున్న రోజులవి. ఆ సమయంలో అల్కాయాజ్ఞిక్ ముంబైలో, నీరజ్ షిల్లాంగ్‌లో ఉండేవారు. దాంతో అల్కా తల్లిదండ్రులు వివాహాన్ని వ్యతిరేకించారు. ఇద్దరూ అక్కడోళ్లు, ఇక్కడోళ్లు అంటే కుదరని పని అని వారించారు. అయినా సరే తల్లిదండ్రులను ఎదిరించి నీరజ్‌ను పెళ్లి చేసుకుంది అల్కాయాజ్ఞిక్.

### ఆ తర్వాతేమైంది..?

ఓవైపు అల్కాయాజ్ఞిక్, మరోవైపు నీరజ్ ప్రేమలో మునిగిపోయారు. అలాంటి సమయంలో వారిరువురి పట్టుదల కాదనలేక.. ఇరువైపులా పెద్దలు వివాహానికి సరేనన్నారు. మొత్తానికి పెళ్లైపోయింది. కొంతకాలం అలా కలిసున్నారో, లేదో.. ఇక ఎవరి వర్కింగ్ ప్లేస్‌లో వారుండి మధ్య మధ్య కలుసుకోవాలనుకున్నారు. అదే సమయంలో అల్కా కెరీర్ ఒక్కసారి పీక్‌కు చేరింది. ఒక్కరోజు కూడా ముంబై విడిచి వెళ్లలేనంత బిజీ బిజీ షెడ్యూల్స్ తయారయ్యాయి. వారిద్దరూ భౌతికంగా దూరం కావడంతో అవి రకరకాల భావోద్వేగాలకు దారితీశాయి. నీ కెరీర్‌కు తగ్గట్టుగా నేను నీకు లభించడం నీ అదృష్టం, కానీ నాది మాత్రం దురదృష్టమంటూ తన భర్త ఎప్పుడూ అనేవాడని చెప్పారు అల్కాయాజ్ఞిక్. ఆయన అలా అనడం వెనుక ముమ్మాటికీ నాదే తప్పంటూ ఒకింత అపరాధ భావాన్ని ప్రదర్శించారామె.

ప్రేమలో పడిన రెండు నెలలకు అల్కాయాజ్ఞిక్, నీరజ్ కపూర్ వివాహం జరిగింది. రాత్రిపూట వారు ఫోన్‌లో గంటల కొద్దీ మాట్లాడుకోవడం, ఫోన్ బిల్స్ బాగా రావడంతో మొదట్లో అల్కా తల్లిదండ్రుల్లో అనుమానం మొదలైంది. ఆ తర్వాత ఇంట్లో గొడవలూ మొదలయ్యాయి. కానీ అల్కా, నీరజ్‌ను పెళ్లి చేసుకోవాలని గట్టిగా నిర్ణయించుకోవడంతో ఆ పెళ్లికి ఒప్పుకోక ఆమె తల్లిదండ్రులకు తప్పలేదు.

అల్కాయాజ్ఞిక్, నీరజ్ కపూర్ ఎక్కువ భాగం వేర్వేరు నగరాల్లో.. ఒకరు ముంబై, ఇంకొకరు షిల్లాంగ్‌లోనే గడిపారు. ఇద్దరి మధ్య ఈ దూరం ఎన్నో అంతరాలకు, అవాంతరాలకూ కారణమైంది. అలా అంతరాలు ఏర్పడినప్పుడల్లా ఒకరినొకరు మళ్లీ అర్థం చేసుకోవడానికి ఓ నాలుగు రోజుల సమయం పట్టేది. తన భర్త నీరజ్‌తో తను ఎక్కువ సమయం కేటాయించలేక పోయినా.. తాను చూపించిన సహనం, ఓపికే తన విజయంలో కీలకపాత్ర పోషించాయంటోంది బాలీవుడ్ సింగర్ అల్కాయాజ్ఞిక్. అలా పెళ్లికి ముందు ప్రేమలో మునిగిపోయిన ఈ భార్యాభర్తలిద్దరూ వివాహమనంతరం 25 ఏళ్లకు పైగా ఒకరికొకరు దూరంగా గడిపాల్సి వచ్చినా.. కలిసి ఉండటమే వీరి ప్రేమకథలో కనిపించే నిజాయితీ, పరస్పర విశ్వాసం. చిన్నచిన్న పొరపచ్చాలకే విడిపోతున్న నేటి రోజుల్లో.. డైవర్స్ అవుతున్న కాలంలో.. అల్కా, నీరజ్ ది ఓ డిఫరెంట్ లవ్ స్టోరీ.

బాతాఖానీ సౌజన్యంతో..

# విజయవంతమైన రెడ్డి వివాహ పరిచయవేదిక

- దూరప్రాంతాల నుంచి హాజరైన రెడ్డి కుటుంబాలు
- కార్యక్రమ నిర్వహణపై హర్షం
- సంఘ భవనానికి విరాళాలకు హామీ
- అభినందించిన రెడ్డి సంక్షేమ సంఘ ప్రతినిధులు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం జిల్లా రెడ్డి సంక్షేమ సంఘం సహకారంతో శ్రీకాకుళం రెడ్డి మాట్రిమోనీ ఆధ్వర్యంలో స్థానిక విజేత ఇన్ హోటల్‌లో ఆదివారం నిర్వహించిన రెడ్డి వివాహ పరిచయవేదిక విజయవంతమైంది. ఈ కార్యక్రమానికి హైదరాబాద్, ఏలూరు, ఒడిశా వంటి దూర ప్రాంతాల నుంచి పలువురు రెడ్డి కుటుంబ సభ్యులు హాజరై, వేదిక నిర్వహణ పట్ల సంఘ పెద్దలకు అభినందనలు తెలిపారు. ఏజెంట్లకు తమ పిల్లల బయోడేటాలతో పాటు వేలకు వేలు పోసినా, నెలల పాటు వారితో టచ్‌లో ఉండాల్సి వచ్చేదని, అయితే కేవలం రూ.1,016తో ఇలా వివాహ పరిచయ వేదికలు ఏర్పాటుచేయడం ఎంతైనా హర్షణీయమన్నారు. వివాహ పరిచయ వేదికను ఏడాదికి ఒకసారి మాత్రమే కాకుండా రెండుసార్లు ఏర్పాటుచేయాలని సంఘ ప్రతినిధులకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా సంఘ ప్రతినిధులు మాట్లాడుతూ విలువైన సమయాన్ని కేటాయిస్తూ దూర ప్రాంతాల నుంచి కూడా వచ్చి కార్యక్రమం విజయవంతం చేసిన రెడ్డి కుటుంబాలకు కృతజ్ఞతలు తెలిపారు. రెడ్డి సంక్షేమ సంఘ భవన నిర్మాణం జరిగితే రెడ్డి సంఘ సభ్యులకు, ముఖ్యంగా పేదలకు జరిగే మేలును వివరించారు. దీనిపై వివాహ పరిచయ వేదికకు హాజరైన రెడ్డి కుటుంబాలు స్పందిస్తూ తమ వంతు సహకారం అందిస్తామని ప్రకటిస్తూ, వివాహ పరిచయ వేదిక నిర్వహించిన శ్రీకాకుళం రెడ్డి మాట్రిమోనీ ప్రతినిధులకు, రెడ్డి సంక్షేమ సంఘ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. శ్రీకాకుళం జిల్లా రెడ్డి సంక్షేమ సంఘం జిల్లా కోశాధికారి బాకి వేణుగోపాలరెడ్డి సారథ్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు బల్లాడ జనార్ధనరెడ్డి, ప్రధాన కార్యదర్శి దుక్క రాజశేఖరరెడ్డి, ఆర్గనైజేషన్ సెక్రటరీ అలపాన త్రినాథరెడ్డి, రాష్ట్ర సలహాదారు ప్రొఫెసర్ దూడ విష్ణుమూర్తిరెడ్డి, సిరుమంతి మోహనరెడ్డి, ఏదూరు శ్రీధర్‌రెడ్డి, అలపాన అప్పోజిరెడ్డి, దుక్క భాగ్యరెడ్డి, పడపాన సుగుణా రెడ్డి, బచ్చు మల్లేశ్వర్ రెడ్డి, రోకళ్ల రాజారెడ్డి, రెడ్డి పెద్దలు, రెడ్డి కుల బంధువులు, వధూవరుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన ట్రెజరర్ వేణుగోపాల్ రెడ్డిని అందరూ అభినందించారు.





# ఎన్టీఆర్‌పై దగ్గుబాటి వ్యాఖ్యలు అనుచితం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

తమ అభిమాన నటుడు నందమూరి తారక రామారావుపై అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్ చేసిన వ్యాఖ్యలు అనుచితంగా ఉన్నాయని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని స్టేట్ వైడ్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ కన్వీనర్, శ్రీకాకుళం జిల్లా ఎన్టీఆర్ ఫ్యాన్స్ అధ్యక్షులు దుంగ శ్రీధర్, శ్రీకాకుళం పట్టణ ఎన్టీఆర్ ఫ్యాన్స్ అధ్యక్షులు బుర్రి మధు తెలిపారు. సోమవారం ప్రకటన విడుదల చేస్తూ మాజీ ముఖ్యమంత్రి దివంగత ఎన్టీఆర్‌పై గౌరవం లేని ఇలాంటి వారిని, ఆ కుటుంబంపై బూతు పదాలు మాట్లాడేవారిని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెంటనే పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే దగ్గుబాటి వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలన్నారు.

‘సింధూర’ ఆవరణలో

# ఉచిత మధుమేహ వైద్యశిబిరం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ ఆధ్వర్యంలో స్థానిక డే అండ్ నైట్ కూడలి సింధూర హాస్పిటల్ ఆవరణలో ఉచిత మధుమేహ వైద్య శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. లయన్ డాక్టర్ పైడి సింధూర, డాక్టర్ మొదలవలస మురళీకృష్ణ, ప్రముఖ నరాల వైద్యనిపుణులు అమర కార్తీక్ రోగులకు, వృద్ధులకు మధుమేహ పరీక్షలు నిర్వహించి, మందులను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా లయన్ డాక్టర్ పైడి సింధూర మాట్లాడుతూ మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందన్నారు. నరాల వైద్యనిపుణులు అమర కార్తీక్ మాట్లాడుతూ సరైన జాగ్రత్తలతో మధుమేహ వ్యాధిని నివారించవచ్చని, వ్యాధిని ముందుగా గుర్తించగలిగితే మధుమేహాన్నీ అరికట్టవచ్చన్నారు. ఆహార అలవాట్లను మార్చుకోవాలని, కూరగాయలను, పండ్లను తీసుకోవాలని, దినచర్యలో వ్యాయామానికి కొంత సమయాన్ని కేటాయించాలని సూచించారు. ప్రతీ నెలలో ఒక రోజు, లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ ఆధ్వర్యంలో ఉచిత మధుమేహ వైద్య శిబిరాన్ని నిర్వహిస్తామని అధ్యక్షురాలు డాక్టర్ సింధూర తెలిపారు. అనంతరం జిల్లా మెంబర్షిప్ చైర్‌పర్సన్ నటుకుల మోహన్, ఎన్విరాన్మెంట్ జిల్లా చైర్మన్ పొన్నాడ రవికుమార్, కార్యదర్శి టెక్కం రామ్‌గోపాల్, ఉపాధ్యక్షులు బోగెల ఉమామహేశ్వరరావులు మధుమేహ వ్యాధిగ్రస్తులు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. వైద్యశిబిరంలో వైద్యులు వి.సాయిగిరీష్, ప్రొఫెసర్ డి.విష్ణుమూర్తి, ఈశ్వర్, ఎన్.రమ్య (యోగ గురువు), డా.ఎంకె మిశ్రో, పొడుగు. చరణ్, సభ్యులు శ్రీనివాస్ చౌదరి, సింధూర వైద్య సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

# ఏకతాటిపైకి వచ్చి మురపాక మండలాన్ని సాధించుకుందాం

- మురపాక మండల సాధన సమితి పిలుపు
- విజయవంతమైన మొదటి అఖిలపక్ష సమావేశం



(సత్యంన్యూస్, లావేరు)

అందరూ ఏకతాటిపైకి వచ్చి మురపాక మండలాన్ని సాధించుకుందామని మురపాక మండల సాధన సమితి (ఎంఎంఎస్) పిలుపునిచ్చింది. మురపాక మండలం ఏర్పాటు లక్ష్యంగా మురపాక రామమందిరంలో ఎంఎంఎస్, శ్రీ వివేకానంద యూత్ సొసైటీ ఆధ్వర్యంలో మొదటి అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. సమావేశానికి వర్షం అడ్డంకిగా మారినా ప్రజలు, నాయకులు, విశ్రాంత ఉపాధ్యాయులు, పలువురు ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. వక్తలు మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా అందరూ ఏకతాటిపైకి వచ్చి పోరాడితేనే మురపాక మండల ఏర్పాటు సాధ్యమన్నారు. ఈ నెల 29న శ్రీకాకుళం జిల్లా కేంద్రానికి క్యాబినెట్ సబ్ కమిటీ వచ్చినపుడు ప్రజలు, నాయకులు ఏకతాటిపైకి వచ్చి స్థానిక శాసన సభ్యులు, పార్లమెంటు సభ్యుల సహాయ సహకారాలతో ‘మురపాక’ వాణిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని, మండలం ఏర్పాటు సాధించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మురపాక-1 ఎంపీటీసీ తేనెల సురేష్‌కుమార్, అల్లినగరం సర్పంచ్ ప్రతినిధి మాడుగుల మురళీధర్ బాబా, విశ్రాంత ఉపాధ్యాయులు మల్లిపెద్ది నారాయణమూర్తి, చదువుల శశిధర్, సామాజిక కార్యకర్త మీసాల భానోజీరావు, గుంటుకుపేట టీడీపీ నాయకులు కొన్ని వెంకట్రావు, ఎచ్చెర్ల జనసేన ఐటి కోఆర్డినేటర్ గొర్లె రాంబాబు, చిన్నయ్యపేట వైకాపా నాయకులు మీసాల అప్పలనాయుడు, రెడ్డి గోపాల్, ఎంఎంఎస్ సభ్యులు బార్ల సింహాచలం, కింతలి వెంకటరమణ, యెన్నేటి ఈశ్వరరావు, కోరుకొండ రాము, దాశెట్టి షన్ముఖరావు, వివేకానంద యూత్ సొసైటీ అధ్యక్షులు బాలి శ్రీనివాసనాయుడు, అన్ని పార్టీల నుంచి వివిధ హోదాలలో ఉన్న నాయకులు హజరయ్యారు.

# అర్హులైన వికలాంగులకు పింఛన్లు పునరుద్ధరించాలి

(సత్యంన్యూస్, కొత్తూరు)

రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన వికలాంగులకు తక్షణమే పింఛన్లను పునరుద్ధరించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సిర్ల ప్రసాద్ డిమాండ్ చేశారు. కొత్తూరు మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వికలాంగుల పింఛన్లు నిలిపివేయడం వల్ల వారు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. శారీరకంగా వికలాంగత్వం ఉన్నవారికి పింఛన్లు జీవనాధారంగా ఉంటాయని, వాటిని రద్దు చేయడం సరికాదన్నారు. ప్రభుత్వ తీరును తీవ్రంగా ఖండించారు. అర్హత కలిగిన ప్రతి వికలాంగుడికి పింఛను మళ్లీ మంజూరుచేయాలని, లేదంటే ఉద్యమాన్ని ముమ్మరం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో సంఘ నాయకులు పాల్గొన్నారు.



# 19న ఉచిత మెగా వైద్యశిబిరం

(సత్యంన్యూస్, పొందూరు)

ఈ నెల 19న ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు స్థానిక శ్రీ సత్యసాయి సేవా మందిరంలో రాగోలు జెమ్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సత్యసాయి సమితి కన్వీనర్ ఎం.రాధాకృష్ణ, ఆసుపత్రి ఏరియా మేనేజర్ ఎస్.రాజు తెలిపారు. ఈమేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఆరోగ్య పరీక్షలతో పాటు మందులు ఉచితంగా ఇస్తారని, ఆరోగ్యశ్రీ, ఈహెచ్ఎస్ ద్వారా అర్హులైనవారికి ఉచిత వైద్య శస్త్ర చికిత్సలను రాగోలు ఆసుపత్రిలో నిర్వహిస్తారని తెలిపారు. వైద్య శిబిరంలో బీపీ, షుగర్, ఈసీజీ, 2డి ఎకో పరీక్షలు ఉచితంగా జరుపుతారని పేర్కొన్నారు. వైద్యనిపుణులు డాక్టర్లు బరాటం సాయితేజ, సురేష్, అప్పలకొండ, సతీష్, భవ్య, మురళీకృష్ణ వైద్యసేవలందిస్తారని, రోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాధాకృష్ణ, రాజు కోరారు.

# ఐతంలో పుస్తకావిష్కరణ




(సత్యంన్యూస్, టెక్కలి)

ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో డేటా సైన్స్ ఆఫ్ కంప్యూటర్ విభాగంలో ఆచార్యులుగా పనిచేస్తున్న డాక్టర్ నరేష్ తంగుడు, జయవర్ధనరావ్ సాహుకారు, ఎస్.కళ్యాణ్, పి.ప్రియాంకలు సంయుక్తంగా రచించిన ‘అల్గొరిథ్మ్ ఫర్ ఇంటిల్ జెంట్ సిస్టమ్స్’ పుస్తకాన్ని కళాశాల డైరెక్టర్ వివి నాగేశ్వరరావు సోమవారం ఆవిష్కరించారు. ప్రస్తుత సాంకేతిక రంగంలో ఉన్న అప్లికేషన్స్ నవీకరణ చేయడానికి ఇంజినీరింగ్ విద్యార్థులకు ఇలాంటి రచనలు మరింతగా ఉపయోగపడతాయన్నారు. ఈ రచనా బృందానికి, ప్రిన్సిపల్ డాక్టర్ ఎఎస్ శ్రీనివాసరావు, బోధన, బోధనేతర సిబ్బంది అభినందించారు.

ఎం.ఇర్షాద్
USHA
ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్..
అన్ని రకాల సెవింగ్ మిషిన్లు, ఫేషన్ మేకర్స్, ఎంబ్రాయిడరీ మిషిన్లు, స్పేర్స్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
NEAR SURYA MAHAL THEATRE
WOMEN'S COLLEGE ROAD,
SRIKAKULAM - 532 001

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రొ॥ వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

SAI OPTICIANS
సరస్వతి మహల్ ఎదురుగా, శ్రీకాకుళం
ప్రొప్రయిటర్: బి.రమణమూర్తి
సెల్: 94407 59739
బ్రాంచ్ ఆఫీస్: గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, శ్రీకాకుళం, సెల్: 94407 59739

డ్రైవర్లు కావలెను
సాయిప్రియ ట్రావెల్స్
శ్రీకాకుళంలో పనిచేయుటకు
డ్రైవర్లు కావలెను
కనీసం 2 నుండి 3 సంవత్సరాల అనుభవం కావలెను
CONTACT
9440001447, 8341163666



# దురద, బురద ఫ్రీ!

(సత్యంన్యూస్, కొత్తూరు)

ఈ నీరు ప్రవహిస్తున్న రోడ్డును పట్టుకొని అలా ముందుకెళ్తే.. కొత్తూరులో మెయిన్ రోడ్డు వస్తుందో, లేదో తెలీదు గానీ, ముందు మీ కాళ్లకు దురదలొస్తాయ్. ఫర్వాలేదని ఈదుకొని వెళ్తే.. మీ వంటికి రోగాలొస్తాయ్. కొత్తూరు నుంచి శ్రీకాకుళం వచ్చే మెయిన్ రోడ్డుకు దగ్గరలో ఉన్న రెల్లివీధి వద్ద ఒళ్లు గగుర్పొడిచే విధంగా కనిపిస్తున్న దృశ్యమిది. కొత్తూరులో అన్ని వీధుల వాడకంనీరూ హడ్డుబంగి గెడ్డలో కలుస్తాయి. అయితే ఈ గెడ్డ ఎప్పుడో పూడికతో నిండిపోయింది. ఇప్పుడు కురుస్తున్న వర్షాలకు కాలువ నుంచి ప్రవహిస్తున్న నీరు ఈ గెడ్డలో కలవడానికి అవకాశం లేకపోవడంతో బ్యాక్‌వాటర్స్ వస్తున్నాయి. కొత్తూరు పంచాయతీలో పారిశుధ్యం ఎంత బాగా ఉందో చెప్పడానికిది సజీవ సాక్ష్యం. వర్షాకాలంలో వరద, బురద రెండూ కామన్. కాకపోతే కాలువల్లో ఏమేరకు చెత్త పేరుకుపోయింది, వాటిని తొలగించి ఎన్నాళ్లయింది? రోడ్డు పక్కనే జనాలు పోస్తున్న చెత్తను ఎత్తి ఎన్నాళ్లయిందో పట్టి చూపించే దృశ్యమిది. ఇప్పుడు వర్షాలు తగ్గగానే జ్వరాలు, జబ్బులు, దగ్గులు వస్తాయి. ఇదేమని అడిగితే.. పాండమిక్ అని, ప్రతీ ఏడాదీ ఇలాగే ఉంటుందని వైద్య ఆరోగ్యశాఖ చెబుతుంది. ప్రతీ ఏడాదిలాగే ఈ ఏడాదీ ఎందుకుండాలి? ఈసారైనా జ్వరాల సంఖ్యను తగ్గిద్దామన్న భావన అటు పంచాయతీ అధికారులకు గాని, ఇటు పాలకులకు గాని ఉండకపోవడం శోచనీయం.

# కేజీబీవీ ప్రిన్సిపాల్ సౌమ్య ఆత్మహత్యాయత్నం

## ❖రిమ్స్‌లో చికిత్స అందిస్తున్న వైద్యులు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

పొందూరు కేజీబీవీ ప్రిన్సిపాల్ సౌమ్య సోమవారం డీసీసీబీ కాలనీ తిలక్ నగర్‌లోని తన నివాసంలో ఆత్మహత్యకు యత్నించారు. ఒక టీవీ చానల్ ఆమెను ఇంటర్వ్యూ చేస్తుండగా పక్కకు ఒరిగిపోయారు. హుటాహుటిన సౌమ్యను ఆమె కారు డ్రైవర్, వంట మనిషి కలిసి రిమ్స్‌కు తరలించారు. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను పరీక్షించిన వైద్యులు మోతాదుకు మించి నిద్రమాత్రలు వేసుకుందని, ప్రస్తుతం ఆరోగ్యం నిలకడగానే ఉన్నా అపస్మారక స్థితిలో ఉన్నట్టు తెలిపారు. వివరాల్లోకి వెళితే.. ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ వేధింపులకు గురిచేస్తూ అకారణంగా కంచిలి బదిలీ చేయించారని ఇటీవల ఆమె దళిత సంఘాలతో కలిసి ఆందోళన చేశారు. కూన రవికుమార్ వల్ల తనకు, తన కుటుంబానికి ప్రాణహాని ఉందని రెండు రోజులుగా ఆరోపిస్తున్నారు. ఈ వివాదంపై రాష్ట్రవ్యాప్తంగా సోషల్ మీడియాలో తీవ్ర రచ్చ సాగుతోంది. దీనిపై ఆదివారం సీఎం చంద్రబాబు ఆరా తీసి ఆగ్రహం వ్యక్తం చేసినట్లు ప్రధాన స్రవంతి మీడియాలో కూడా వార్తలొచ్చాయి. ఇంతలోనే సౌమ్య ఆత్యహత్యకు ప్రయత్నించడం చర్చనీయంశంగా మారింది. సామాజిక మాధ్యమాల్లో సౌమ్యను టీడీపీ శ్రేణులు ట్రోల్ చేయడంతో పాటు, బెదిరింపులకు పాల్పడడంతోనే ఆత్యహత్యకు యత్నించినట్లు కుటుంబ సభ్యులు 'సత్యం'తో పేర్కొన్నారు. ప్రస్తుతం సౌమ్య రిమ్స్‌లో చికిత్సపొందుతున్నారు.

# ఆదిత్యుని దర్శించుకున్న హైకోర్ట్ జస్టిస్



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రత్యక్ష దైవం ఆరోగ్య ప్రదాత శ్రీ సూర్యనారాయణ స్వామివారిని హైకోర్ట్ జస్టిస్ తుహిన్‌కుమార్ గేదెల దంపతులు సోమవారం దర్శించుకున్నారు. దేవాలయానికి వచ్చిన వారిని ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర శర్మ, ఆలయ కార్య నిర్వహణాధికారి కేఎన్‌వీడీవీ ప్రసాద్ పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు, వేదపండితులు వేద మంత్రాలతో ఆశీర్వదించి స్వామివారి ప్రసాదాలను, చిత్రపటం అందజేశారు.

## సముద్రంలో మునిగిపోక ముందు

# ద్వారకానగరం ఎలా ఉండేది?

(మొదటిపేజీ తరువాయి)

ఒక పెద్ద గోదాము 64 బ్లాకులతో ఉండేది' అని తెలిపారు. 'ద్వారకలోని ఇంజనీర్లు తొలుత హార్బర్ టెక్నాలజీని అభివృద్ధి చేసి సముద్రంలో వాడారు. బెట్ ద్వారకలోని పోర్టు వద్ద ఏర్పాటుచేసిన మౌలిక సదుపాయాల నిర్మాణానికి దోహదం చేసిన ఈ టెక్నాలజీ, భారత నౌకాశ్రయ నిర్మాణ చరిత్రల్లో అత్యంత ముఖ్యమైన దానిలో ఒకటిగా నిలిచింది' అని ప్రొఫెసర్ ఎస్.రావు పేర్కొన్నారు. ఎన్నో విగ్రహాలు, లోహపు వస్తువులు ద్వారకలో, బెట్ ద్వారకలో ఇప్పటి వరకు జరిగిన అధ్యయనాల్లో, వివిధ రకాల రాళ్లు, మార్బుల్, వివిధ లోహాలకు చెందిన వస్తువులను కనుగొన్నారు. విష్ణుమూర్తి ఒక చేతిలో గద, మరో చేతిలో సుదర్శన చక్రం ఉన్న 'త్రివిక్రముడి' విగ్రహం కూడా బయటపడినట్లు ప్రొఫెసర్ ఎస్.ఆర్.రావు తన పుస్తకంలో రాశారు. 'ద్వారకలోని జగత్ మందిర్ ముందు సముద్ర గర్భంలో జరిపిన తవ్వకాల్లో రాగి, కంచు, ఇత్తడితో చేసిన అనేక వస్తువులు లభించాయి. వీటిలో ముఖ్యమైనవి మూడు కుండలు, ఒక పెద్ద గంట రథం అవశేషాలు.'

'ఈ రకమైన రాగి కుండను భారతదేశంలో రాగి యుగం నుంచి ఉపయోగిస్తున్నారు, ఇది క్రీస్తుపూర్వం 3000 నుంచి 700 మధ్య కాలం నాటిదని భావిస్తున్నారు. ద్వారక మట్టిలో లభించిన అనేక ఇత్తడి వస్తువులు భారతదేశంలో మరే ఇతర చారిత్రక ప్రదేశంలో కనుగొనలేదు. రాగి, జింక్ మిశ్రమాన్ని కలిగి ఉన్న కొన్ని మిశ్రమ మిశ్రమాల అవశేషాలు కూడా ఇక్కడ కనుగొన్నారు. వాటిలో ముఖ్యమైనవి ఏనుగులు, గేదెలు, ఖడ్గమృగాల ప్రతిమలు. ఇవి చక్రాలతో రూపొందించిన బండిపై ఉన్నట్టుగా కనిపిస్తున్నాయి.' తవ్వకాలలో లభించిన వస్తువులలో ఆయుధాలలో ఇనుము పరిమాణం తక్కువగా ఉన్నట్టు గుర్తించారు. ఇది ఆ సమయంలో ఇనుము తక్కువగా వాడటం లేదా కొరతను సూచిస్తుందని నిపుణులు భావిస్తున్నారు. 'వీటితో పాటు ఇనుప గోళ్లు, హ్యాండిల్స్‌తో కూడిన వాటర్ బాటిల్స్ కూడా దొరికాయి. సిలికాన్, ఇనుము, మాంగనీస్, కాల్షియం, మెగ్నీషియం వంటి లోహాల అవశేషాలు కూడా ఈ రకమైన పాత్రలలో కనుగొన్నారు. శంఖంతో చేసిన వస్తువులు కూడా లభించాయి.' అని ఎస్.ఆర్. రావు రాశారు.

బెట్ ద్వారకలో బయటపడ్డ శాసనాల్లో క్రీస్తు పూర్వం 1001 నుంచి 2000 మధ్యనాటి రచనలకు సంబంధించిన తొలి స్పష్టమైన ఆధారం లభ్యమైంది. దీంతో, ద్వారక ప్రజలు అక్షరాస్యులని తెలిసింది. 'సింధు నాగరికత లిపిని వెలికితీయడంలో ఇది కీలక పాత్ర పోషించింది. సింధు, బ్రాహ్మీ లిపులకు మధ్యన తెగిపోయిన లింక్‌ను పూడ్చడంలో ఇది కీలక పాత్ర పోషించింది' అని ఎస్.ఆర్.రావు రాశారు. బెట్ ద్వారకలో కనుగొన్న శాసనాల్లో వాడిన పదాలు, మహాభారత సమయంలో సంస్కృతానికి ఎంత ప్రాధాన్యం ఇచ్చారో గుర్తించారు. అదేవిధంగా, ద్వారకలో బయటపడిన కుండలు, అత్తరు బాటిళ్లు ఆ సమయంలోని కళలు, హస్తకళా నైపుణ్యాన్ని తెలియజేస్తున్నాయి. ప్రొఫెసర్ త్రిపాఠి గతంలో బీబీసీతో మాట్లాడుతూ 'గోమతి నది సముద్రంలో కలిసే ప్రాంతం చుట్టూ ఎక్కువగా తవ్వకాలు జరిగాయన్నారు. అక్కడి సముద్రంలో అనేకసార్లు తవ్వకాలు జరిపాం. తవ్వకాల్లో బయటపడిన వాటికంటే అక్కడ ఇంకా ఎక్కువ ఉండవచ్చునని, ఆ ప్రక్రియ కొనసాగుతోందని, పరిశోధన కొనసాగుతుందని చెప్పారు.

# హరీ! పదవిని పంచుకోవాలి మరి



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం నగర కళింగకోమటి అధ్యక్షుడిగా కోరాడ హరిగోపాల్‌ను నియమిస్తూ ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు బోయిన గోవిందరాజులు ప్రకటించారు. కాకపోతే ప్రమాణస్వీకారం చేసిన దగ్గర్నుంచి ఏడాది కాలంపాటే అధ్యక్షుడిగా ఉంటారని, ఆ తర్వాత ఊణ్ణ సర్వేశ్వరరావు అధ్యక్ష బాధ్యతలు స్వీకరిస్తారని గోవిందరాజులు తీర్పునిచ్చారు. స్థానిక కళింగవైశ్య కల్యాణ మండపంలో ఆదివారం రాత్రి జరిగిన నగర సంఘం అధ్యక్షుడి ఎంపికలో కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఆదివారం నాటికి మూడు ప్యానల్‌లు బరిలో ఉండటంతో అందర్నీ ఒప్పించడం కోసం కళింగకోమటి నేతలంతా సంయమనంగా వ్యవహరించారు. ముందుగా కోరాడ హరిగోపాల్ అధ్యక్ష బాధ్యతలు చేపడతారని, ఆ తర్వాత రెండున్నరేళ్లు ఊణ్ణ సర్వేశ్వరరావు అధ్యక్షుడిగా ఉంటారని తీర్మానించారు. ఈమేరకు లిఖితపూర్వకంగా ఒక కాగితం మీద ఒప్పందం కుదుర్చుకున్నారు. దీనికి కట్టుబడతామంటూ స్వయంగా హరిగోపాల్, ఊణ్ణ సర్వేశ్వరరావులు సంతకం చేయగా, మిగిలినవారు సాక్షి సంతకాలు చేశారు. తంగుడు రాజు, మళ్లా కల్యాణ్ చక్రవర్తి, అంధవరపు చైతన్యప్రభులు తాము కూడా పోటీలో ఉన్నామని ప్రకటించడంతో మరోసారి అవకాశమిస్తామని వీరిని మొదట పోటీ నుంచి తప్పించారు. ముందుగా కుదుర్చుకున్న ఒప్పందం మేరకు మొదటి ఏడాది కోరాడ హరిగోపాల్, ఆ తర్వాత రెండున్నర సంవత్సరాలు ఊణ్ణ సర్వేశ్వరరావు, మిగిలిన కాలపరిమితికి కోరాడ రమేష్‌లు అధ్యక్షులుగా ఉంటారని రాసుకున్నారు. కానీ ఎన్నికల వేదిక వద్ద మాత్రం కోరాడ రమేష్‌ను జిల్లా కార్యదర్శిగా నియమించడానికి తనకున్న రాష్ట్ర అధ్యక్షుడి హోదాలో అధికారాన్ని వాడుకుంటానని బోయిన గోవిందరాజులు స్పష్టం చేశారు. మొదటి ఏడాది కోరాడ హరిగోపాల్‌కు అధ్యక్ష బాధ్యతలు అప్పగించడంతో ఆయన వర్గం పెద్ద ఎత్తున సంబరాలు చేసుకుంది. శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ కూడా హరిగోపాల్‌కే అధ్యక్ష బాధ్యతలు అప్పగించే విధంగా చక్రం తిప్పాలని అంధవరపు సంతోష్‌కు సూచించారు. ఆ మేరకే హరిగోపాల్ ఎన్నికకు మార్గం సుగమమైంది. బోయిన గోవిందరాజులు నచ్చజెప్పినా ఊణ్ణ సర్వేశ్వరరావు వెనక్కు తగ్గకపోవడంతో ఆయన కూడా రెండున్నరేళ్లు అధ్యక్షుడిగా పని చేస్తారని బోయిన తీర్మానించారు. ఇద్దరూ తెలుగుదేశం పార్టీలోనే ఉన్నందున ఎవర్నీ కాదనలేకపోతున్నామని, అందుకే పదవీ కాలాన్ని పంచాల్సివస్తోందని బోయిన గోవిందరాజులు పేర్కొన్నారు.

**ఎమ్మెల్యేని విమర్శిస్తున్నవాడిపై అభిమానమెందుకు?**

నగర కళింగకోమటి సంఘం నూతన అధ్యక్షుడ్ని ఎంపిక చేసే ప్రక్రియలో భాగంగా ఆ సమావేశంలో పూర్వ అధ్యక్షుడు పీవీ రమణ లేకపోవడం బాధగా ఉందంటూ రాష్ట్ర అధ్యక్షుడు బోయిన గోవిందరాజులు పేర్కొనడంతో, కళింగకోమటి సంఘలో యువనాయకుడిగా ఉన్న శిల్లా మణికంఠ దీనికి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. స్వయంగా స్థానిక ఎమ్మెల్యేపైనే విమర్శలు చేస్తూ ఏ పార్టీలో ఉన్నాడో తెలియని వ్యక్తి కోసం, అది కూడా ఈ సమావేశంలో లేనివారి కోసం బాధపడటం సరికాదని మణికంఠ పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు తెలుగుదేశం నేతలే అధ్యక్ష, కార్యదర్శులు కావాలని తీర్మానించుకున్న తర్వాత కూడా స్థానిక ఎమ్మెల్యేని విమర్శిస్తున్న వ్యక్తిని ఇక్కడ ప్రస్తావనకు తీసుకువచ్చి తమకు మనుగడ లేకుండా చేయడం సరికాదని గోవిందరాజులుకు మణికంఠ కౌంటరిచ్చారు.

## జస్టిస్ తుహిన్‌కుమార్‌ను కలిసిన

# జిల్లా బార్ అసోసియేషన్



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఆంధ్రప్రదేశ్ హైకోర్ట్ జడ్జిగా ఇటీవల ప్రమాణ స్వీకారం చేసిన జస్టిస్ తుహిన్ కుమార్‌ను ఆయన స్వగ్రామం పార్వతీపురం జిల్లా వీరఘట్టం మండలం కత్తుల కవిటి గ్రామానికి ఈ నెల 16న తొలి సారి విచ్చేసిన సందర్భంగా ఆయనను శ్రీకాకుళం జిల్లా బార్ అసోసియేషన్ మర్యాదపూర్వకంగా కలిసింది. దుస్సాలువ, పూలదండతో అభినందించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లా బార్ అసోసియేషన్ న్యాయవాదులు, బార్ అసోసియేషన్ పూర్వ అధ్యక్షులు వాన కృష్ణచంద్, బార్ అసోసియేషన్ పూర్వపు అధ్యక్షులు డాక్టర్ ఎన్ని సూర్యారావు, చీఫ్ డిఫెన్స్ కౌన్సిల్ కొమరాపు ఆఫీస్ నాయుడు, బార్ అసోసియేషన్ పూర్వపు ఉపాధ్యక్షులు మామిడి క్రాంతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వయం కృషితో రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి స్థాయికి ఎదిగినా ఒదిగుండే లక్షణం ఆయనదని బార్ ప్రతినిధులు కొనియాడారు.



186వ ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఏపీ రాష్ట్ర సృజనాత్మకత సాంస్కృతిక సమితి సౌజన్యంతో ఇండియా ఇంటర్నేషనల్ ఫోటోగ్రఫీ కౌన్సిల్, ఫోటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా సంయుక్తంగా నిర్వహించిన జాతీయ ఫోటోగ్రఫీ దినోత్సవంలో విజయవాడలో సాక్షి ఫొటోగ్రాఫర్ కుప్పిలి జయశంకర్ సీనియర్ ఫోటో జర్నలిస్ట్ అవార్డును అందుకున్నారు. ఈ అవార్డును రాష్ట్ర టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ, డాక్టర్ మండలి బుద్ధ ప్రసాద్, మాజీ ఎంపీ డాక్టర్ గోకరాజు గంగరాజు చేతుల మీదుగా స్వీకరించారు.

- సత్యంన్యూస్, విజయవాడ

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.